తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త








## దివ్యప్రబంధ అధ్యయనోత్సవాలు ఆరంభం



తిరుమల, డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి: ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11రోజుల ముందు దివ్యప్రబంధ అధ్యయనంగా పిలిచే అధ్యయ నోత్సవాలు సోమవారం రాత్రి మొదలయ్యాయి.. ఆలయంలోని రంగ నాయకుల మండపంలో జీయం గార్లు, ఆలయ అర్చకులు ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను పారాయణం చేశారు. జనవరి 23వతేదీ వరకు అధ్యయనోత్సవాలు వైభవంగా జరిపిస్తారు. తొలి 11రోజులు పగల్‌పత్తుఅని, మిగిలిన 10రోజులు రాపత్తుఅని వ్యవహరిస్తారు. 22వరోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వరోజు రామానుజ నూట్రందాది. 24వరోజులు స్వామివారి శాత్తుమొర, 25వ రోజు అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి. తొలిరోజు కార్యక్రమంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, ఆలయ పుష్కార్ రామకృష్ణ అర్చకులుపాల్గొన్నారు.

### ఆ పదిరోజులు నిర్దేశిత రోజు,సమయానికే

# దర్శనానికి అనుమతి

**-వైకుంఠ ఏకాదశి,ద్వాదశి రోజుల్లో సమన్వయంతో సేవలు**

**-పూర్తి పహరాలో భద్రత : అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల, డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:
అత్యంత పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆ పదిరోజులు టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులు నిరేదశించిన రోజు, సమయానికి క్యూలైన్లలో అనుమతిస్తామని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. దర్శనం కోసం ఎక్కువసమయం వేచివుండటాన్ని నివారించేందుకు సమయానికి మాత్రమే భక్తులను దర్శనాలకు అనుమతినిస్తామని తెలిపారు. ఆ పదిరోజులు దర్శన టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే ఆలయంలోనికి అనుమతించబడుతారని వెల్లడించారు. వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా భక్తుల భద్రత, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణపై సోమవారం సాయంత్రం అన్నమయ్యభవనంలో టిటిడి సిఇ సత్యనారాయణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ శ్రీధర్, అదనపు ఎస్పీలు రామకృష్ణ, వెంకట్రావు, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్‌ఓ ఎస్టీవిరామ్‌కుమార్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిఐలు, విజయకుమార్, రాముడుతో కలసి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు. జనవరి 10నుండి 19వ తేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వార దర్శనాల్లో భక్తులు వాహనాలు సాఫీగా పార్కింగ్ చేసుకునేలా చూడాలని, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు.వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు కలసి సమన్వయంతో భక్తుల భద్రత,దర్శనాలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

- బహుళ ప్రయోజనకారి..గగనానికి తప్పనిగురి
- శ్రీహరికోట నుంచి దూసుకెళ్లిన పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్
- నిర్ణీతకక్ష్యలో స్పేడెక్స్ ఉపగ్రహాలు
- అమెరికా, చైనా, రష్యా తర్వాత మనదే ఘనత
- విక్రమ్‌సారాబాయ్ వర్ధంతి రోజున ఇస్రో ఘనవిజయం
- సోమనాథ్‌ను అభినందించిన పలువురు శాస్త్రవేత్తలు
- షార్‌లో ఉత్సాహం, ఉల్లాసం
- మంచును లెక్కచేయకుండా క్రిక్కిరిసిన వీక్షకుల గ్యాలరీ



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 30 ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి సోమవారం రాత్రి పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ చీకటిని చీల్చుకుంటూ గగనతలం వైపు దూసుకెళ్లింది. రాత్రి 10గంటల 15 సెకన్లకు ఇక్కడి మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ నిర్ణీత కక్ష్య వైపు పయనించింది. మొదటి, రెండు, మూడు దశలను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత కీలకమైన నాలుగవ దశ 523 సెకన్లకు మొదలైంది. ఈ దశ జరుగుతున్నప్పుడు శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, మాజీ ఛైర్మన్ ఎఎస్ కిరణ్‌కుమార్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో సహా పలువురు ఉత్కంఠతో వీక్షించారు. 794 సెకన్లకు నాలుగవ దశ రాకెట్ నుంచి విడిపోయింది. దీనితో పోయంగా పిలిచే 24 ఉపకరణాలు, రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలతో నాలుగవ దశ నిర్ణీత లక్ష్యానికి దూసుకెళ్లింది. భూమికి 476 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో సెకనుకు 7621 మీటర్ల వేగంతో ఈ దశ కక్ష్యకు చేరింది. ప్రయోగం జరిగిన సరిగ్గా 911 సెకన్లకు స్పేడెక్స్-బి ఉపగ్రహం, అనంతరం మూడు సెకన్ల వ్యవధిలో 914 సెకన్లకు స్పేడెక్స్-ఎ ఉపగ్రహం కక్ష్యలోకి ప్రవేశించాయి. ఈ దృశ్యాలను ఆన్‌లైన్ కెమెరాల ద్వారా శాస్త్రవేత్తలు వీక్షించారు. స్పేడెక్స్ ఉపగ్రహాల ప్రయోగం సక్సెస్ కావడంతో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌ను పలువురు కరచాలనాలతో అభినందించారు. ఛైర్మన్ వడివడిగా మిషన్ కంట్రోల్ సెంటర్లోని పోడియం వద్దకు చేరుకొని దూరదర్శన్‌లో జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రయోగ విజయానికి కారకులైన పిఎస్ఎల్‌వి బృందానికి అభినందనలు తెలిపారు. ఇస్రో టీమ్‌తో పాటు దేశంలోని వివిధ స్టార్టప్ కంపెనీలు, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాల వారు కూడా ఇందులో పేలోడ్లు రూపొందించి ప్రయోగించారని, నాలుగవ దశ నుంచి అవి వివిధ కక్ష్యల్లోకి ప్రవేశిస్తాయని చెప్పారు. ప్రయోగం స్పేడెక్స్ ఉపగ్రహాల ప్రవేశంతో పూర్తి కాలేదని, అంతరిక్షంలోనే కొన్ని నిమిషాల పాటు విన్యాసాలు కొనసాగుతాయని చెప్పారు. మిషన్ డైరెక్టర్ జయకుమార్ ఈ ప్రయోగ విజయాన్ని ఆస్వాదిస్తూ శాస్త్రవేత్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. స్పేస్ క్రాఫ్ట్ డైరెక్టర్ ఎన్.సురేంద్రన్ తన ప్రసంగంలో ఈ ప్రయోగాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకొని ఎన్నో భవిష్యత్ ప్రయోజనాల కోసం రూపొందించినట్లు పేర్కొన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. డిసెంబర్ 30న అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ వర్ధంతి. అదేరోజు ప్రతిష్టాత్మక రాకెట్‌ను ఆయన ఎంపిక చేసిన శ్రీహరికోట స్థలం నుంచి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారని కొందరు గుర్తు చేశారు. మంచును సైతం లెక్కచేయకుండా షార్‌లోని వీక్షకుల గ్యాలరీకి వందల సంఖ్యలో వీక్షకులు తరలివచ్చి చీకటి మార్గాన వెళ్లే రాకెట్‌ను దగ్గరగా వీక్షించారు. సిఐఎస్ఎఫ్ దళాలు, తిరుపతి జిల్లా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## అమ్మణ్ణిని దర్శించుకున్న సోమనాథ్



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 30 ప్రభాతవార్త
శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి సోమవారం రాత్రి జరిపిన పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ ప్రయోగానికి ముందు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శ్రీచెంగాళమ్మకు పూజలు చేశారు. శ్రీహరికోటకు సమీపంలోని సూళ్లూరుపేటలో వెలసిన శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవిని ప్రతి రాకెట్ ప్రయోగానికి ముందు సోమనాథ్ దర్శించుకుంటున్నారు. ఇదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఆయన అమ్మణ్ణి ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్న 99వ రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని మొక్కుకున్నట్లు ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీచెంగాళమ్మతో పాటు పరివార దేవతలకు పూజలు చేసిన అనంతరం ఆస్థాన మండపంలో ప్రసన్నలక్ష్మి.. సోమనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఛైర్మన్ వెంట ఎంఎస్‌ఎ గ్రూప్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

# సమస్యలకు పరిష్కారం లభించేనా!



జిల్లా పరిషత్ కార్యాలయం

**- మూడు జిల్లాల అధికారులు హాజరవుతున్నా ఫలితాలు శూన్యం**

**- చర్చించడానికి 11 అంశాల అజెండా**

**- నేడు ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం**

చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు మినహాయించి మిగిలిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు ప్రజల సంక్షేమం అటకెక్కితే మరోవైపు అభివృద్ధి పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయి. ఈ క్రమంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం ఉమ్మడి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని జడ్పీటిసీలు, ఎంపిపిలతో పాటు తిరుపతి, రాజంపేట జిల్లాల ఉన్నత అధికారులు మొత్తం హాజరు కానున్నారు. మూడు జిల్లాల ఉన్నత అధికారులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీటిసీలు, ఎంపిపిలు ఈ సమావేశానికి హాజరు అవుతున్నప్పటికీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ముందడుగు పడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కావాల్సివుంది. జడ్పీ సమావేశంలో చర్చించడానికి జడ్పీ పాలకవర్గం 11 అంశాలతో కూడిన అజెండా అంశాలను సిద్ధం చేసింది. ఈ సమావేశంలో వ్యవసాయం, ఉద్యానశాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా, గృహ నిర్మాణశాఖ, పంచాయతీరాజ్ శాఖ ప్రగతి, జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రగతి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రగతి, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రగతిపై సభ్యులు సమీక్షించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కాకున్నా వ్యవసాయంపై చర్చించాలని నిర్ణయించిన జడ్పీ పాలకవర్గం అజెండాలో మొదటి అంశంగా వ్యవసాయశాఖ, 2వ అంశంగా ఉద్యానశాఖను చేర్చింది. ఉద్యానశాఖకు సంబంధించి మామిడి ఇన్సురెన్స్‌పై ప్రస్తుత సమావేశంలో కొంత చర్చ జరిగే అంశం వుంది. అలాగే సమావేశంలో మూడవ అంశంగా విద్యాశాఖ, 4వ అంశంగా వైద్యశాఖపై చర్చించాల్సివున్నప్పటికీ వర్షాకాలం పూర్తి కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోవడంతో ఈ శాఖపై పెద్దగా చర్చ సాగే అవకాశం వుండదు. అజెండాలో 5వ అంశంగా గ్రామీణ నీటి సరఫరాపై వుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ట్యాంకుల క్లీనింగ్ చేపట్టకపోవడంతో క్షేత్ర స్థాయిలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు వుంటాయని, ఈ మేరకు ప్రతి నెలా క్షేత్ర స్థాయిలో మంచినీటి ట్యాంకులను క్లీచింగ్‌తో క్లీనింగ్ చేపట్టాలని సభ్యులు డిమాండ్ చేసే అవకాశం వుంది. అలాగే 6వ అంశంగా గృహ నిర్మాణ శాఖ ప్రగతి చర్చ అజెండాలో పొందుపరచగా ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో ఇళ్ళ నిర్మాణాలు ఏమి చేపట్టకపోవడం, కొత్తగా ఇళ్ళ మంజూరు లేకపోవడంతో ఈ శాఖపై సైతం చర్చ జరిగే అవకాశం కన్పించడం లేదు. 7వ అంశంగా విద్యుత్ శాఖను అజెండాలో చేర్చడంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు అమర్చడంపై ప్రస్తుతం సీనియర్‌గా ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితుల్లో ఈ అంశంపై సభ్యులు చర్చించే అవకాశం కన్పిస్తోంది. ఇక 10వ అంశంగా నీటి యాజమాన్య సంస్థ ప్రస్తుతం అమలు చేస్తున్న మినీ గోకులం పథకంపై పాడి రైతుల్లో ఆసక్తి నెలకొంది. పాడి రైతులు అత్యధికులు మినీ గోకులం షెడ్లను ఆశిస్తున్నప్పటికీ ఉపాధి హామీ పథకం కింద ఒకొక్క మండలానికి పరిమితంగా మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తుండటంతో అత్యధిక పాడి రైతులు మినీ గోకులం షెడ్ల కోసం అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో మినీ గోకులం షెడ్లు మంజూరు చేయా లని ఇటు ఎమ్మెల్యేలు, అటు జడ్పీటిసీలు సమావేశంలో డిమాండ్ చేసే అవకాశం వుంది.

### మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసులో

# గౌతమ్‌తేజ్ అరెస్ట్



పలమనేరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దగ్ధం కేసులో సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌ను సిఐడి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జూలై 21న అర్ధరాత్రి అగ్నిప్రమాదంలో కార్యాలయంలో పలు ముఖ్యమైన రికార్డులు దగ్ధం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రమాదం చర్చనీయాంశంగా మారిది. ఈ కేసులో అప్పటి కార్యాలయ సీనియర్ అసిసెంట్ గోరంట్ల గౌతమ్ తేజ్‌పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసు దర్యాప్తును ప్రభుత్వం సిఐడికి అప్పగించడంతో రాష్ట్ర సిఐడి అధికారుల ఆదేశాల మేరకు తిరుపతి సిఐడి రీజనల్ డిఎస్పీ డి.వి.వేణుగోపాల్ బృందం పలమనేరుకు సోమవారం చేరుకుని గౌతమ్‌తేజ్‌ను తన నివాసం వద్ద నుండి పలమనేరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిఐడి బృందం గౌతమ్‌తేజ్‌ను సుదీర్ఘంగా విచారణ జరిపిన అనంతరం గౌతమ్‌తేజ్ వద్ద నుండి సుమారు 8 పేజీల లిఖితపూర్వకంగా నివేదికను తీసుకున్నారు. అనంతరం అధికారుల బృందం గౌతమ్‌తేజ్‌ను జ్యూడీషియల్ కష్టడీ నిమిత్తం చిత్తూరు నాలుగవ ఎజేసిఎ కోర్టులో హాజరు కోర్డు ఆనుమతులతో రిమాండుకు తరలించారు.

## స్కూటర్‌ను ఢీకొన్న కారు : భార్యభర్తలకు తీవ్ర గాయాలు



చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
స్కూటర్‌ను కారు ఢీకొనడంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు...గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లికి చెందిన రెడ్డెప్ప(35), శివకుమారి(28)లు అత్తగారిళ్ళు నిమ్మనపల్లికి టూవీలర్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా, చౌడేపల్లి-బోయకొండ మార్గ మద్యలో చిన్నకొండామర్రికి సమీపంలోని మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది ఈ ప్రమాదంలో రెడ్డెప్ప, శివకుమారీ భార్యభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రెడ్డెప్పకు ఎడమచేయి, శివకుమారికి కుడికాలు విరిగిపోయింది. తీవ్ర రక్తస్రారం జరగడంతో ఇద్దరూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. గాయపడ్డ వారిని 108సిబ్బంది గణేష్, ప్రసాద్‌లు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ వారిద్దరి పరిస్థితి విషమించడంతో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మానవత్వం చాటుకున్న ఎస్ఐ నాగేశ్వర్‌రావు : చిన్నకొండామర్రి వద్ద రోడ్డు ప్రమాదం సంభవించిందన్న సమాచామందుకొన్న ఎస్ఐ నాగేశ్వర్‌రావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం వాటిళ్ళకుండా చర్యలు తీసుకొంటూ క్షతగాత్రులను 108సేవల ద్వారా ఆసుపత్రికి తరలించారు.

## 6,7 తేదీల్లో సిఎం కుప్పం పర్యటన?



కుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో జనవరి 6,7 తేదీల్లో పర్యటించనున్నట్లు సమాచారం. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిసింది. కుప్పంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అయితే సిఎం కుప్పం పర్యటన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా తెలియాల్సి ఉంది.

## ప్రొఫెసర్ ఉమా మహేష్ సస్పెన్షన్



తిరుపతి విద్య డిసెంబర్ 30 ప్రభాతవార్త:
ఎస్వీ వ్యవసాయ కళాశాల క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ వి ఉమా మహేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎన్జీరంగా వర్సిటీ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేశారు. తిరుపతి న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఉద్యోగుల క్రమశిక్షణా నియమనిబంధనల ప్రకారం వర్సిటీ అధికారులు ఆయనపై సస్పెన్స్ వేటు వేశారు.

# ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు

**ప్రధాన రోడ్లు, ఫ్లై ఓవర్లపై కొత్త సంవత్సర వేడుకలు నిషిద్ధం**

**మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా : ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎవరైనా పోలీసు నిబంధనలు ఉల్లంఘించి నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. మంగళవారం రాత్రి చిత్తూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రోడ్ల వద్ద చెక్‌పోస్టులు, పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, రాత్రి 10 గంటల నుండి తెల్లవారుజాము వరకు వాహనాల తనిఖీ జరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లాలో మద్యం దుకాణాలు, బార్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మూతపడాలన్నారు. చిత్తూరు నగరంలో ప్రధాన రోడ్లు, ఫ్లై ఓవర్‌లపై నూతన సంవత్సర వేడుకలను నిషేధించడం జరిగిందని, స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ అనలైజర్ ద్వారా పట్టుబడిన వ్యక్తులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. అలాగే హోటళ్ళు, ఫంక్షన్ హాళ్ళు, ప్రైవేటు స్థలాల నిర్వాహకులు ముందు గానే నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు అనుమతి తీసుకోవాలని, అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే వేడుకల ప్రాంగ ణాల్లో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, బాణా సంచా, పేలుడు పదర్ధాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. అలాగే బహిరంగ మద్యపానం, ట్రిపుల్ రైడింగ్ పూర్తిగా నిషేధం అని, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, 6 నెలల జైలు లేదా లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడుపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ నిషేధమని, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్‌లు తీసివేసి అధిక శబ్దాలతో రోడ్లపై వచ్చిన వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుం దన్నారు. ఎవరైనా మద్యం మత్తులో అత్యుత్సాహం ప్రదర్శించి ప్రజల ఆస్తులు, ఇతరులకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై చట్టప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని సోషల్ మీడియాలో ఎవరైనా అభ్యంతరకర పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్లపై కేక్‌లు కట్ చేయడానికి ఎక్కడా అనుమతి లేదని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. ప్రజలందరు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు.

# శాంతి భద్రతల పరిరక్షణకై పటిష్టమైన భద్రత

**విధి నిర్వహణలో పోలీసులు దీక్షతో విధులు నిర్వహిస్తున్నాం**

**వార్షిక నేరాల నివేదికలో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు**



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 30, ప్రభాతవార్త
ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకై జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రత నిర్వహిస్తుందని, విధి నిర్వహణలో పోటీసులు దీక్షతో విధులు నిర్వహిస్తున్నామని వార్షిక నేరాల నివేదిక సమావేశంలో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు వెల్లడించారు. సోమవారం శ్రీ పద్మావతి సావేరి కాన్ఫరెన్స్ హాల్‌లో వార్షిక నేరాల గణాంకాలపై మీడియా కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఏడు శాతం మేరకు కేసులు తగ్గాయన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు నమోదు పెరిగాయన్నారు. 2023 ఎన్‌సిఆర్‌పిల ద్వారా నమోదైన సైబర్ కేసులలో ఇప్పటివరకు రూ. 2,44,60,014ల నగదును సైబర్ నెరగాళ్లు దోచకోగా రూ. 84,08,392ల నగదును రికవరీ చేసి నేరుగా బాధితులకు రిఫండ్ చేయించారు. 2024 ఎన్‌సిఆర్‌పిల ద్వారా నమోదైన సైబర్ కేసులలో ఇప్పటివరకు రూ. 12,89,28,136ల నగదును సైబర్ నెరగాళ్లు దోచుకోగా రూ. 2,36,16,426ల నగదును రికవరీ చేసి నేరుగా బాధితులకు రిఫండ్ చేయించడం జరిగిందన్నారు. ఈ మొబైల్ హంట్ అప్లికేషన్ సేవల ద్వారా వచ్చిన ఫిర్యాదులలో ఇప్పటి వరకు రూ. 7,56,40,000 విలువ గల 4275 మొబైల్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా జనసంచారం ఉన్న ప్రాంతాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ళ వద్ద మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, ట్రాఫిక్ రూల్స్ హెల్మెట్ ధరించుటపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లు, హోర్డింగ్లను ఏర్పాటు చేసి విరివిగా ప్రచారం చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, పాటశాల విద్యార్ధిని, విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాలో పట్టుపడిన 36 లక్షల విలువైన మద్యం బాటిళ్లను వివిధ సైజుల్లో (క్వార్టర్, హాఫ్, ఫుల్) మొత్తం 27,568 మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ సాయంతో ధ్వంసం చేసారన్నారు. సైబర్ క్రైమ్ వారోత్సవాలు 9 రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించి గ్రామ స్థాయి నుండి విద్యా సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల యందు సైబర్ నేరాల పై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసామన్నారు.

## డిసిసిబి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆవిష్కరించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఓ మనోహర్‌గౌడ్, ఎజిఎం లిల్లీక్యాథరిన్‌లు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిని సోమవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా డిసిసిబి సిఇఓ మనోహర్‌గౌడ్ డిసిసిబి 2025 క్యాలెండర్‌ను అన్ని హంగులతో సిద్ధం చేసిందని, ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించాలని కోరగా జాయింట్ కలెక్టర్ ఈ మేరకు డిసిసిబి-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## మన రెడ్డి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి

గంగాధర నెల్లూరు డిసెంబరు 30 ప్రభాతవార్త:

మన రెడ్డి సంఘం 2025 క్యాలెండర్‌ను సోమవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆవిష్కరించారు.మన రెడ్డి సంఘం అధ్యక్షులు బలరాం రెడ్డి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా మన రెడి జన సంఘం బలోపేతానికి పెద్దిరెడ్డి చేసిన కృషి మరువలేను అని అన్నారు.అనంతరం వైఎస్ ఆర్‌సిపి ఎంపి మిథున్ రెడ్డిని కలసి మెమెంటోతో పాటు మన రెడ్డి సంఘం క్యాలెండర్‌ని అందించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు వైఎస్ఆర్ ఇంచార్జ్ రాజేష్ నాయకులు కామసాని చిన్నమ రెడ్డి శంకర్ మొదలి చిట్టిబాబు దేవేందర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వెలగని వీధి దీపాలు స్పందించని అధికారులు



పాకాల, డిసెంబర్ 30, ప్రభాతవార్త : పాకాల మండలం దామల చెరువు పంచాయతీ బంధార్లపల్లి గ్రామంలో గత ఒక నెల నుంచి రాత్రిపూట వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట పాములు జర్రులు తేళ్ల తిరుగుతూ ఉన్నందున ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వీది దీపాలు వెలిగేలా చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వహించండి



చిత్తూరురూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త: ప్రభుత్వ వాహనాలు నడిపే డ్రైవర్లు జాగ్రత్తలను పాటిస్తూ విధులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్ల సంఘ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెడుతూ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సంఘం చేపట్టిన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చిన వెంటనే ప్రతి ఒక్కరు సహకారం అందించారన్నారు. కాగా భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాలకు తాము అండగా నిలుస్తామని ప్రభుత్వ, ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు సెల్వంకు హామి ఇచ్చారు. అనంతరం డ్రైవర్లకు గిఫ్ట్ బాక్స్, స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు

గంగాధర నెల్లూరు డిసెంబరు 30 ప్రభాతవార్త: మండలంలోని వేల్కూరు గ్రామంలో వెలసి యున్న శ్రీ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్పరావార శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం హనుమజ్జయంతి వేడుకలను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు.ఈ సందర్బంగా ఉదయం తిరుప్పావైపారాయణం పుణ్యాహవాచనము రక్షాబంధనం కలశ పూజ వ్యాస్థి హోమములు పూర్ణాహుతి సాత్తు మొర కార్యక్రమాలను నరసింహ అయ్యంగార్ ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు శుక్రవారం సౌతారామ కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని విద్యుత్ దీప కాంతుల మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహించనున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించాలని కోరారు.

## పక్కాగా ఇవిఎం గోడౌన్ల భద్రత : కలెక్టర్



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: కలెక్టరేట్ ఆవరణలో వున్న ఇవిఎంల గోడౌన్ భద్రత పక్కాగా వుండాలని, గోడౌన్ వద్ద నిరంతరం భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించి గోడౌన్‌లో ఇవిఎంలు భద్రపరచిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఇవిఎంలు భద్రపరచిన గోడౌన్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఇవిఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్ల భద్రత గురించి గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకిటీల సురేంద్రకుమార్(తెలుగుదేశం), అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), ఉదయ్‌కుమార్(వైకాపా)', పరదేశి(కాంగ్రెస్), ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు -మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త : భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు.సోమవారం పంచాయతీ కేంద్రం కెనమాకులపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజలు తమ భూముల రీసర్వే, మ్యుటేషన్ తదితర సమస్యలపై వినతిపత్రాలు సమర్పించవచ్చని త్వరలోనే ప్రభుత్వ ఆదేశాలతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్‌ఎంపిపి ఉదయ్, నేతలు ఎల్.జయరాంరెడ్డి, రమేష్, శివ, డిటి కౌలేష్, విఆర్వో బాబు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు ప్రశాంతంగా జరుపుకోవాలి

రొంపిచెర్ల, యర్రావారిపాలెం, డిసెంబర్ 30, ప్రభాతవార్త:

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని యర్రావారిపాలెం ఎస్సై డి వై స్వామి, రొంపిచర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, చిత్తూరు జిల్లా ఎస్పీ వి. ఎన్. మణికంఠ చందోలు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. వైన్ షాపులను ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయంలో మూసివేయాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. అలా వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. వాహనదారులు త్రిబుల్ రైడ్ చేయరాదని అన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని కోరారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు కలిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### - ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దేనని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అన్నారు. బివిస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నింటికీ విద్యావిధానమే మూలమని, రాష్ట్రంలో విద్యా విలువలు మరింత పెంపొందేవిధంగా సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నా రన్నారు. తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు దృష్టి సారించి విలువలతో కూడిన విద్యను బోధిస్తూ, విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్న ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు. చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి వచ్చిన అవకాశంను ప్రతి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎస్ఎంసి ఛైర్మన్ నాగేంద్ర, హెడ్మాస్టర్ తులసీబాబు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, ఎపి ఉమెన్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు వైవి రాజేశ్వరీ, ఎంఇఓలు సెల్వరాజ్, మోహన్‌లు, పాఠశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక దిగుబడులు

### - జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి




శ్రీరంగరాజపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: మామిడికి ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేస్తే తక్కువ ఖర్చు, శ్రమతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి అన్నారు. శ్రీరంగరాజపురం వెలుగు సమావేశభవనంలో సోమవారం రైతులు మామిడి తోటల పెంపకంలో సంరక్షణ అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మామిడి తోటలు పెంచి లాభాలు పొందారని, ప్రస్తుత మామిడి పరిస్థితి అంతంతమాత్రంగా వుండటంతో ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ఫామ్ సాగు చేయాలని రైతులకు సూచించారు. కోకో ఎగ్జిక్యూటివ్ మనోజ్ మాట్లాడుతూ కోకో పంట వల్ల రైతులకు వచ్చే ఆదాయంను వివరించారు. కార్వేటినగరంకు చెందిన కోకో రైస్ మున్స్వామి రాజు కోకో సాగులో తన అనుభవాలను చెప్పారు. ఈ కార్యక్రమంలో జిడినెల్లూరు ఉద్యానశాఖ అధికారి లోకేష్, అమ్మ ఆయిల్‌ఫామ్స్ ప్రతినిధి మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పొరబాట్లు సరిదిద్దడం కోసమే రీ-సర్వే

శ్రీరంగరాజపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల సర్వేలో జరిగిన పొరబాట్లను సరిదిద్దుకోవడం కోసమే ప్రస్తుతం రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు లోకనాథపిళ్ళై అన్నారు. 50 కన్నికాపురం గ్రామంలో సోమవారం తహసిల్దారు లోకనాథపిళ్ళై ఆధ్వర్యంలో రీ-సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్బంగా తహసిల్దారు మాట్లాడుతూ మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీల పరిధి 38 రెవెన్యూ గ్రామాలు వున్నాయన్నారు. ఇందులో 6 రెవెన్యూ గ్రామాల్లో రీ-సర్వే జరిగిందని, గత ప్రభుత్వంలో జరిగిన ఈ సర్వేలో ఏదైనా తప్పులు జరిగి వుంటే సరిదిద్దడానికి ప్రస్తుతం రీ-సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

## భూసమస్యలను పరిష్కరించడానికే రీ-సర్వే

పాలసముద్రం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే ప్రస్తుత ప్రభుత్వం భూముల రీ-సర్వేను పునఃప్రారంభించిందని తహసిల్దారు అరుణకుమారి అన్నారు. భూముల రీ-సర్వే గ్రామసభల నిర్వహణపై సోమవారం తహసిల్దారు అరుణకుమారి కృష్ణజిమ్మాపురం గ్రామంలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసిల్దారు మాట్లాడుతూ భూముల రీ-సర్వేకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని, గతంలో జరిగిన సర్వేల్లో ఎక్కడైనా పొరబాట్లు జరిగి వుంటే తమ దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో నిర్వహించిన సర్వేపై పలు ఫిర్యాదులు అందాయని వాటిని మరోసారి రీ-సర్వే చేసి నిజమైన హక్కుదారులకు భూములు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, విఆర్ఓ వెంకటాచలం, గ్రామ సర్వేయర్ హరి తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్దుడి మృతి

చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త

కారు ఢీకొని వృద్దుడు మృతి చెందిన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసముద్రంకు చెందిన చెంగన్న(63) ఆదివారం రాత్రి పలమనేరు రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రాత్రి సమయం కావడంతో వృద్ధుడిని ఢీకొన్న కారు ఆపకుండా వెళ్ళిపోయింది. తర్వాత పోలీసులు రంగ ప్రవేశం చేసి అదే గ్రామానికి చెందిన కారుగా గుర్తించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ముగిసిన రెవిన్యూ సదస్సులు.. 351భూసమస్యలు

చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులు సోమవారం పెద్దఎల్లకుంట్లతో ముగిశాయి. మండలంలో 15సచివాలయాల పరిధిలో 16రోజులపాటు సదస్సులు జరిగాయి. వీటిలో 351మంది రైతులు భూ సమస్యలపై వినతి పత్రాలందించారు. సమస్యలను బట్టి 43రోజులుగా పరిష్కరిస్తామని రెవిన్యూ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. వీటిలో దిగువపల్లి రెవిన్యూ సదస్సులో అత్యధికంగా వందకు పైగా రైతులు వినతి పత్రాలందించగా, లద్దిగంలో అత్యల్పంగా 9మంది మాత్రమే అర్జీలిచ్చారు.

## సిఎస్ఐ కన్వెన్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



పుంగనూరు రూరల్, డిసెంబర్ 30, ప్రభాతవార్త పట్టణ పరిధిలోని సి.ఎస్.ఐ చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన కన్వెన్షన్ హాల్ ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించారు, మెమోరియల్ కన్వెన్షన్ హాల్ నిర్మాణంలో ఆర్థికంగా అండగా నిలిచినందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలకు చర్చి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ అలీం భాషా, వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఫోటో 30 పిజిఆర్ 02: ఫంక్షన్ హాల్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

## తెదేపా నేత జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం

శాంతిపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త

మాజీ వైస్‌ఎంపిపి ఉదయ్‌కుమార్ నాయుడు తన జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, లోకి, రుద్రప్ప, మురళి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 169 సమస్యలు



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై 169 అర్జీలు అందజేశారు. ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ క్షేత్ర స్థాయిలో సత్వరం సమస్యలను పరిష్కరించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హాజరయ్యారు.

## ఏకపక్షంగా మండల బిజెపి అధ్యక్షుడి ఎన్నిక

పాలసముద్రం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: పార్టీలోని శ్రేణులన్నింటినీ సంప్రదించి ఏకగ్రీవంగా మండల పార్టీ అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహించాల్సివుండగా మండల బిజెపి కార్యవర్గం అందుకు విరుద్దంగా ఏకపక్షంగా ఎంపికైందని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు ధ్వజమెత్తారు. మండల బిజెపి అధ్యక్షుడి ఎంపికపై ఆయన సోమవారం ఆరోపణలు చేస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు క్షేత్ర స్థాయిలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని, ఏకగ్రీవంగా మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ మండలాల్లోని నాయకుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని బిజెపి నాయకులు ఏకమై ఏకగ్రీవ ఎన్నికలను రద్దు చేసి అందరికి ఆమోగ్యమైన నాయకులను ఎన్నుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పూతలపట్టు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: చిత్తూరు-తిరుపతి రహదారిలో పూతలపట్టు మండల పరిధిలో పి.కొత్తకోటకు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రూప(27) మృతి చెందింది. ఓ ఫ్రైవేటు ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న రూప సోమవారం తెల్లవారుజాము విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా కంటైనర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పాకాల మండలం చేనుగారిపల్లికి చెందిన రూప రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాధ ఛాయలు నెలకొన్నాయి. పూతలపట్టు పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులపై సమగ్ర సమాచారం రూపొందించాలి

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వ శాఖల అధికారులు సమగ్ర సమాచారం రూపొందించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) కార్యక్రమాన్ని పి.డి.నిర్వహించారు. ప్రజలనుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు కుప్పంలో ఈనెల 6,7తేదీల్లో పర్యటించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలనుంచి వచ్చిన వినతుల పరిష్కారంపై సైతం అధికారులు నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన గోకుల ం షెడ్లు, సిసి రోడ్లు, నీటి బోర్ల డ్రిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి 1.5కోట్లు మంజూరైనాయన్నారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, షాదీమహల్ నిర్మాణాలకు సైతం సుమారు 4కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రైతుల పంటల రక్షణకు సంబంధించి ఏనుగులు, అడవిపందుల దాడుల విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, సుబ్రమణ్యం, ప్రభాకర్, హిమ్మత్ సాగర్, ఎంఇఓ మహబూబ్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చీమనాయనపల్లిలో రెవెన్యూ సదస్సు

కుప్పంరూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి చీమనాయనపల్లి గ్రామంలో సోమవారం తహశీల్దార్ చిట్టిబాబు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేతో పాటు ఇతర భూసమస్యలు, పేర్లమార్పు, మ్యుటేషన్‌కు సంబంధించిన సమస్యలను రైతులు, ప్రజలు తమ దృష్టికి తెస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వో కృష్ణమూర్తి, సర్వేయర్ శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, నేతలు నారాయణ, బాబు, మునిరత్నం పాల్గొన్నారు.

## సంచార జాతుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రామకుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త

రామకుప్పం మండల సంచార జాతుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలను సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు రవి అధ్వర్యంలో జరిగాయి. మండల అధ్యక్షుడిగా వెంకటాచలపతి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడుగా అయ్యప్ప, మంజునాథ్, రాజప్ప, సోమశేఖర్, కార్యదర్శులుగా రాజగోపాల్, రామప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు వెంకటాచలపతి మాట్లాడుతూ మండలంలో సంచార జాతుల వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సంచార జాతుల కులాలకు ఉచిత విద్యుత్ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేశం నేతలు సుబ్రి, మహేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## నూతన సంవత్సర డైరీ, క్యాలండర్ ఆవిష్కరణ

రొంపిచెర్ల, డిసెంబర్ 30,ప్రభాతవార్త:

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్ రెడ్డి చేతుల మీదుగా సిటీ మార్ట్, వాగ సూట్స్ హోమ్ స్టే క్యాలండర్, డైరీని ఆవిష్కరించారు. రొంపిచెర్ల మండలానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు ఊటుకూరి ప్రతాప్ రెడ్డి (ప్రవీణ్ రెడ్డి) తిరుపతిలోని రేణిగుంట రోడ్డులో తిరుపతి సిటీ మార్ట్, వాగ సూట్స్ హోమ్ స్టేను నిర్వహిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన సిటీ మార్ట్, వాగ సూట్స్ హోమ్ స్టే క్యాలండర్, డైరీ లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు బాలాజీ, తిమ్మారెడ్డి, కుమార స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం

### నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, డిసెంబర్ 30, ప్రభాతవార్త ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కావేటి గారి పల్లె శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం చల్లా రామచంద్రారెడ్డి సందర్శించారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు చల్లా రామచంద్రారెడ్డి పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ మాజీ జడ్పిటిసి రామనాథం నాయుడు టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్, లెక్కల ధనంజయ నాయుడు, మురళి నాయుడు, రవి నాయుడు అన్నా స్వామి, ధనుంజయ నాయుడు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేషనల్ డ్రాగన్ బోట్ ఛాంపీయన్ షిప్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



తిరుపతి క్రీడ, డిసెంబర్ 30, ప్రభాతవార్త

జనవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ యమునా నది వేదికగా నేషనల్ డ్రాగన్ బోట్ ఛాంపి యన్‌షిప్ 2025 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకుగానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ చంద్రగిరి నియోజకవర్గంలోని రాయలచెరువులో సెలక్షన్స్, స్పెషల్ ట్రైనింగ్ క్యాంపును శాప్, ఏపీ కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. త్వరలో జరగనున్న నేషనల్ డ్రాగన్ బోట్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఏపీ క్రీడాకారులు అత్యుత్తమంగా రాణించి మన రాష్ట్రానికి అత్యధిక పతకాలు సాధించాలని పోత్సహించడం జరిగింది. ఈపోటీల్లో ఏపీ నుంచి 35 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

## వాకర్స్ గవర్నర్‌గా మాధవనాయుడు



పుత్తూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త : రాయలసీమ జిల్లాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి డిస్ట్రిక్ట్ 302 గవర్నర్‌గా పుత్తూరు పట్టణానికి చెందిన రావిళ్ల మాధవనాయుడు ఎన్నికయ్యారు. సోమవారం ఏలూరులో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ ఆత్మీయ సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వాకర్స్ అసోసియేషన్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్లో తనను గవర్నర్‌గా ఎన్నుకునేందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు మురళీమోహనరావు, ప్రభావతి, డాక్టర్ రవిరాజు, కోనేటి రవిరాజు, శరత్‌కుమార్‌రాజు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, పేరూరు సుధాకర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, గోపిప్రసాద్, కృష్ణంరాజు,మునికృష్ణలు పాల్గొన్నారు.

## శివాలయానికి రూ. 2,86,041 లక్షల హుండీ ఆదాయం



పుత్తూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ. 2,86,041 లక్షల ఆదాయం లభించింది. సోమవారం ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన సొమ్ము లెక్కించగా గత ఆరు నెలలకు గాను ఈ ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాణాధికారి పి.జయకృష్ణ తెలిపారు. అలాగే ఆరేటమ్మ ఆలయ హుండీ ఆదాయం గత ఎనిమిది నెలలకు గాను రూ. 1,20,161 లక్షలు వచ్చాయని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు నైనేరి విక్కిరాయల్, జి.బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ, అర్చకులు మురళీధర్ గురుకుల్, పోలీస్ సిబ్బంది జె.బాలకృష్ణ పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని అధికారులపై కఠిన చర్యలు

### కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 30, ప్రభాతవార్త

సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని సచివాలయాల కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించి, అందుబాటులో లేని వారిపై చర్యలకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ నగర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రతి సచివాలయం వద్ద కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర,, మేనేజర్ హాసిమ్, ఏసిపి బాలాజి, డి.ఈలు, సూపరింటెండెంట్లు, తదితరులు ఉన్నారు.

## "దైవకార్యానికి సంకెళ్ళు"

### జన్మస్థల శివాలయ నిర్మాణానికి అడ్డంకులెన్నో..!

రామచంద్రాపురం, డిశంబర్ 30 ప్రభాతవార్త:



దైవకార్యానికి సంకెళ్ళు వేస్తున్నారని రేకలచేను గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రేకలచేను సమీపంలోని జన్మస్థల శివాలయం ఆవరణలో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 200 ఏళ్ళ క్రితం నిర్మించిన పురాతన ఆలయం శిధిలావస్థకు చేరుకోవడంతో ఆ ఆలయానికి ప్రక్కనే దాతల సహకారంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. కొంత మంది స్వార్థపరులు అనేక అడ్డంకులు కల్పిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు పంచాయతీల పరిధిలోని దాతల సహకారంతో నూతన ఆలయ నిర్మాణాన్ని సుమారు 90 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కొంత మంది ఆలయ నిర్మాణానికి సహకరించకపోగా, భూమి ఆక్రమించుకున్నట్లు తహశీల్దార్‌కు ఫిర్యాదులు చేస్తున్నారని వాపోయారు. గ్రామస్థుల ఫిర్యాదుతో తహశీల్దార్ వెంకటరమణ ఆదేశాల మేరకు పోలీసులు దాతలపై ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పంటలు మునిగిపోతున్నాయని పన్నూరు వాసులు ఫిర్యాదు



విజయపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: పట్టా భూముల్లో సుమారు వంద ఎకరాలకు పైగా పంటలు మునిగిపోతున్నాయని పన్నూరు వాసులు సోమవారం తహసీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. కళియంబాకం రెండవ చెరువు(కడపేరి) ఐదు సంవత్సరాల క్రితం మరమ్మతు చర్యల్లో భాగంగా మొరవ పెంచడం వలన పట్టా భూముల్లో పంటలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కళియంబాకం-పన్నూరు దళితవాడకు మధ్యలో ఉండడంతో ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి నీరు బయటకు వచ్చే తూములను కొందరు రైతులు పూర్తిగా మూసి వేయడం వలన ఉన్న పంటలు మునిగిపోతున్నాయని, కొత్తగా పంటలు చేయలేకపోతున్నామని వాపోతున్నారు. సంఘటనా స్థలాన్ని మండల వ్యవసాయాధికారిణి సందర్శించారు. తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈలకు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బీచ్ గ్రాఫ్లింగ్ పోటీలకు పల్లం విద్యార్థి




శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మునికుమార్ రాష్ట్ర స్థాయి బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో ఎంపికై జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆ విద్యార్థిని పాఠశాలలో సత్కరించారు. ఈ నెల 28,29 తేదుల్లో కృష్ణాజిల్లా కృష్ణలంక కృష్ణానది ఒడ్డున రాష్ట్ర గ్రాప్లింగ్ రేజ్లింగ్ అసోసియేషన్ సారధ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పల్లం విద్యార్థి మునికుమార్ 30కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి ఎంపికకు ఎంపికయ్యారు. ఈ ఏడాది ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొన్నారు. మునికుమార్‌ను తీర్చి దిద్దటంలో వ్యాయామ ఉపాధ్యాయిని పుష్పవాని ని ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆనంద్‌తో పాటు ఉపాధ్యాయులు కెవిబాబు, రెడ్డెప్ప, వర్లేశ్వరి,మోహన్‌బాబు,, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రమణ,శిరీష, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపు

వడమాలపేట, డిసెంబరు 30 ప్రభాతవార్త: కొన్నేళ్లుగా వివాదాస్పదంగా ఉన్న ప్రభుత్వ పొరంబోకు స్థలాన్ని హై కోర్టు తీర్పు మేరకు గుర్తించి సర్వే చేసి గ్రామస్థులకు రెవెన్యూ సదస్సులో కోర్టు తీర్పు ప్రతిని అందజేశారు. తహాసీల్దార్ జరీనా ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి రెండు ఎకరాలు డంపింగ్ యార్డుకు, 37 సెంట్లు శ్మశనానికి కేటాయిస్తూ సర్వే రాళ్లు నాటి గ్రామస్థులకు అప్పగించారు. 2015లో సర్వే నెం.216లో గ్రామంలో డంపింగ్ యార్డు, శ్మశనానికి సుమారుగా 9.40 ఎకరాల మేరకు ప్రభుత్వం కేటాయిం చింది. దీనిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హై కోర్టును ఆశ్రయించారు. చివరకు తాజాగా పొరంబోకు స్థలంలో గ్రామ అవసరాల దృష్ట్యా 2.37 ఎకరాల భూమి కేటాయిస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును అమలు చేస్తూ సోమవారం సర్వే చేసి రాళ్లు నాటి గ్రామస్థులకు అప్పగించారు. ఎస్ఐ ధర్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గోవిందా దీక్షా భక్తులకు...టికెట్లు జారీ చేసి దర్శనం కల్పించాలి

**- అనంత గోవింద దాస్ ట్రస్ట్ గోవింద పీఠం భక్తుల విజ్ఞప్తి**




తిరుపతి హెల్త్ డిసెంబరు 30 ప్రభాతవార్త : తిరుపతిలోని దీక్షా భక్తులకు ప్రతి ఏడు వైకుంఠ ద్వారా దర్శనం కల్పించేందుకు టీటీడీ ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించి తద్వారా గోవింద మాలా దీక్ష భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలని అనంత గోవింద దాస్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు శ్రీధర్, ప్రబోదానందులు టీటీడీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలో నివాసం ఉండే భక్తులు 1984 నుంచి మాలలు ధరించి తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుని భక్తులు దీక్ష విరమిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. టీటీడీ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఏ ఒక సెంటర్‌లోనైనా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శ్రీవారి భక్తులకు టిక్కెట్లు జారీ చేసి దర్శన భాగ్యం కల్పించాలని, టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోవింద మాలాధారణ దీక్షా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ మాదిగలుగా గుర్తించాలని కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి



తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 30 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల క్రింది స్థాయి సిబ్బంది ఎస్సీ జాబితాను తయారు చేస్తున్న నేపథ్యంలో ఎస్సీ ఆది ఆంధ్రా, ద్రావిడను రద్దు చేసి ఆ స్థానంలో ఎస్సీ మాదిగలు గా గుర్తించాలని కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్ళి కలెక్టర్‌కు నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, నాయకులు గోపి, వాసుదేవరావు, రాజేంద్ర, శివయ్య, నవీన్‌కుమార్, మునేవేలు, రవి, ఎంఎల్ఎఫ్ సంగీతం రామ్మూర్తిలు పాల్గొన్నారు.

## ఎస్ఎల్ త్రీ ఫౌండేషన్‌కు అరుదైన అవకాశం



చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులకు సేవ చేసుకునే అరుదైన అవకాశం తమకు లభించినట్లు ఎస్ఎల్ త్రీ ఫౌండేషన్ అధినేత పడిలేటి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నూతన ఏడాదిలో కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడుతుండటంతో బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి కోరిక మేరకు సోమవారం ఎస్ఎల్ త్రీ ఫౌండేషన్ తరఫున లక్ష్మీనారాయణ రెడ్డి, ఆయన సతీమణి ఎస్.శిరీషా, కుమారులు ఎస్.సృజన్, ఎస్.సమన్యు, ఎస్.సుజాత విద్యార్థినులకు రూ.50 వేలు విలువ కలిగిన 400 ప్లేట్స్, 400 గ్లాసులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకరమణ, ప్రసాద్, రెడ్డిరాణి, అన్నపూర్ణ, సుమిత్ర, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడుగా పురుషోత్తంరెడ్డి



చంద్రగిరి, డిసెంబర్30 ప్రభాతవార్త: బిజెపి మండల అధ్యక్షుడుగా రాజులగారి పురుషోత్తం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికలఅధికారి, బిజెపి జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరిలో సోమవారం బిజెపి కమిటీ సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు ఎస్.దొరస్వామి అధ్యక్షతన జరిగింది. మండల అధ్యక్షుడుగా పోటీ లేకపోవడంతో పురుషోత్తం రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కె.వెంకటముని, నాయకులు టి.సుబ్రమణ్యం యాదవ్, నరేష్‌కుమార్ నాయుడు, సక్కుర్ మునిగంగిరెడ్డి, సునీల్ యాదవ్, తిలక్ యాదవ్, ఇందుశేఖర్,కృష్ణమూర్తి,పివి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## స్విమ్స్ వారిచే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం కందులవారి పల్లి, పాత భీమవరం సచివాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు కొటాల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జె.ప్రియాంక తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సుశీలాదేవి, ఈఓపిఆర్‌డి ఎం.శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను, సర్పంచులు రాగిణి, బి.లక్ష్మి, ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

చంద్రగి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగివుండటం తప్పనిసరి అని శ్రీవెంకటేశ్వర లీగల్ సొసైటీ లాయర్ గౌతమి అన్నారు. స్థానిక ప్రభుతక్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం ఎస్వి లీగల్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ భద్రత, ప్రస్తుత డిజిటల్ యుగంలో సురక్షిత చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రకాష్, వి.హరికృష్ణ, హశ్వంత్‌లు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం



తొట్టంబేడు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గ్రామాల్లో పూరి స్థాయిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరిం చడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. సోమవారం మండలంలోని దొంగల ముదూరు, శ్రీకృష్ణాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహశీల్దార్ మధుసూధనరావు మాట్లాడుతూ గ్రామాల్లో అన్నదాతలకు సమస్యలు ఉండకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఉండేలా చూస్తామన్నారు. మండలంలోని 27 పంచాయతీలు 41 రెవెన్యూ గ్రామాల్లో ఈసదస్సులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, సర్వేయర్ హరనాథ్, సచివాలయ సర్వేయర్‌లు విజయలోకేష్, శ్రీరాఘవ, విఆర్ఓ గోపి పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజలుదొంగలముదూరు గ్రామానికి శ్మశానానికి దారిచూపాలని వినతిపత్రం ఇవ్వడంతో స్పందించిన తహశీల్దార్ సర్వేయర్, విఆర్ఓలతో చర్చించి స్థలాన్ని పరిశీలించి త్వరలోనే స్థలాన్ని చూపుతామని పేర్కొన్నారు.

## 7కేజీల గంజాయి స్వాధీనం-ఇద్దరు అరెస్టు

తొట్టంబేడు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: పట్టణంలోని టుటౌన్ స్టేషన్ సిఐ సి.వెంకటేశులుకు వచ్చిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి సర్కిల్ వద్ద ఒడిస్సా నుంచి కేరళలోని ఎర్నాకులంకి గంజాయి తీసుకెళ్తూ చెన్నై మీదుగా కేరళ వెళ్ళడానికి ఉదయం సమయంలో బస్సుకోసం వేచి ఉండగా శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు వచ్చిన ఒడిస్సా రాష్ట్రంకు చెందిన కె.బిజయ్ దోల్‌బెహార(29), ఎస్.సుక్కు మండల్(25)లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి:కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. లీలా మహల్ కూడలిలోని శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం చుట్టూ సుందరీకరణ చేయాలని, మహిళా మార్ట్ లిఫ్ట్ ను మరమ్మతులు చేయించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కమిషనర్ ను కోరారు. అలాగే కే.కే లే అవుట్ నందు పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, చింతలచేను రాముల వారి ఆలయం వద్ద యుడిఎస్ లైన్ సరిచేయాలని, ఎస్.టి.వి. నగర్ నందు బోరు మరమ్మతులు చేయించాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ నందు ఎగ్జిబిషన్ పెట్టడంతో పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉందని అనుమతుల మంజూరు ఆపు చేయాలని, కొంక చెన్నాయగుంట వద్ద గల సాయి విష్ణు లేఔట్ కు దారి కల్పించాలని, రాజన్న పార్కు లో నీటి సౌకర్యం కల్పించాలని, దక్షిణం వైపు తారు రోడ్డు వేయించాలని కోరారని తెలిపారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హాసిమ్, డి.ఈ.లు, ఏ.సి.పి. బాలాజి, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న 'జేసీ' శుభం బన్సల్

**- జేసీని అభినందించిన విభిన్న ప్రతిభావంతుడు**

**- శభాష్ జేసీ అని మెచ్చుకుంటున్న అర్జీదారులు, బాధితులు**



తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 30 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామం ఈశ్వరయ్య కాలనీకి చెందిన గబ్బా వెంకటేశ్వరరావు వయస్సు 55 సంవత్సరాలు వచ్చాడు. అతను పుట్టుకతో విభిన్న ప్రతిభావంతుడు. తాను నాలుగు చక్రాల బండిపై ప్లవర్ వాజ్ కుండీలను విక్రయించుకునే వాడు. అలా చేయడం వలన తనకు కష్టంగా ఉందని తనకు ఒక మోటార్ సైకిల్ ఇప్పిస్తే తాను దానిపై వెళ్ళుటకు సులభ తరంగా ఉంటుందని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీని బాధితుడు గబ్బా వెంకటేశ్వరరావు ఇచ్చి సహాయం అందించగలరని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సదరు అర్జీని పరిశీలించి జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ వారి సహకారంతో గబ్బా వెంకటేశ్వరరావుకు మూడు చక్రాల ట్రై సైకిల్‌ను అందించారు. దీంతో అతను జేసీని అభినందించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన కొన్ని అర్జీదారుల, బాధితుల సమస్యలను అక్కడికక్కడే కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పరిష్కరిస్తున్న నేపథ్యంలో అర్జీదారులు, బాధితులు జేసీని మెచ్చుకోవడం అభినందనీయం.

## ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు :డిఎస్పి

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 38 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా గౌరవ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గారు ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 38 మందికి 3,80,000 జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అభినందించినారు.

## స్విమ్స్ కార్డియాలజిలో సాయంత్రం పే క్లినిక్

తిరుపతి హెల్త్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో కార్డియాలజి విభాగం పేషంట్ల అధిక సంఖ్యలో హాజరౌ తున్న కారణంగా పేషంట్ల సౌకర్యార్థం కార్డియాలజి విభాగం వారు సాయంత్రం రెండవ పే క్లినిక్ అందుబాటులోకి తెస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్ తెలియజేశారు. ప్రతిరోజు సాయంత్రం 4 గం లకు స్విమ్ శ్రీ పద్మావతి ఓ.పి.డి. బ్లాక్ నందు రూమ్ నెం:17లో కార్డియాలజి వైద్య నిపుణులు సీనియర్ ప్రొఫెసర్ డా. వనజాక్షమ్మ ఆధ్వర్యంలో పే క్లినిక్ ను జనవరి 2025, 1వ తేది నుంచి నిర్వహించనున్నారు.

## స్కేటింగ్ లో రికార్డ్ సృష్టించిన అట్లాంటిస్ విద్యార్థులు



తిరుపతి విద్య, డిసెంబర్ 30 ప్రభాతవార్త : స్థానిక కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల విద్యార్థులు స్కేటింగ్ లో రికార్డు సృష్టించారు. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఈనెల 28,29 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలలో భాగంగా అట్లాంటిస్ విద్యార్థులు అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఇందులో భాగంగా రెండవ తరగతి చదువుతున్న శ్రీ చరణ్ తేజ రెడ్డి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెండేసి బంగారు పతకాలు సాధించడమే కాక రిలే రేస్ నందు రజిత పథకాన్ని సాధించి జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల అధినేత కేవిస్ వాసు మాట్లాడుతూ క్రీడలలో అత్యుత్తమమైన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో మా విద్యార్థులు ఎంపికవడం చాలా సంతోషదాయకమని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.ఆర్ అనురాధ గోపాల్,ప్రమీల కృష్ణన్, వైస్ ప్రిన్సిపల్ మోహకర్ పాల్గొని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## రెడ్ బకెట్ బిర్యానీ రెండవ బ్రాంచ్ ప్రారంభం

తిరుపతి విద్య, డిసెంబర్ 30 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్ బకెట్ బిర్యానీ రెండవ బ్రాంచ్ ని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు,నగర మేయర్ డాక్టర్ శిరీష, ముబ్బు దేవ నారాయణ రెడ్డి సోమవారం ప్రారంభించారు.స్థానిక ఎం ఆర్‌పల్లి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రెడ్ బకెట్ బిర్యానీ రెండవ బ్రాంచ్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తిరుపతిలో రెండు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.బి నిర్వాహకులు రవీంద్రారెడ్డి,శైలజ,సురేష్ రెడ్డి, సంధ్య, ప్రతాప్‌రెడ్డి చందన తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య అభివృద్ధికి క్రీడలు ఎంతో మేలు




తిరుపతి విద్య, డిసెంబర్ 30 ప్రభాతవార్త: భాష్యం ప్రీమియర్ లీగ్ 2024, జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కెవిఎస్ గ్రౌండ్ తుమ్మలగుంట నందు ఇంట్రా జోనల్ క్రికెట్ సెమీ ఫైనల్స్ అండ్ ఫైనల్స్ ఘనంగా నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథిగా తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం.తమీమ్ అహ్మద్ విచ్చేసారు. విద్యార్థులు అందరూ చాలా చక్కని క్రీడా స్ఫూర్తితో ఆడినారని తమ జట్టు విజయం కోసం అందరూ కృషి చేశారని, ఓడినవారు కృంగిపోకుండా మరలా ప్రయత్నం చేయాలని తెలియచేశారు.విజయం సాధించిన వారికి తమీమ్ అహ్మద్ బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్స్,హెచ్ఎమ్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన పీ.సీ.రాయులు



తిరుపతి విద్య, డిసెంబర్ 30 ప్రభాతవార్త : డాక్టర్ పీ సీ రాయులు చైర్మన్ కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ సభ్యుదుదిశా రూరల్ దెవలప్ మెంట్ అండ్ పి ఆర్,ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా,ఎం ఎస్ ఎమ్ ఈ (రాజ్యబాషా) ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా.తిరుపతి మరియు తమిళనాడుకు తన అధికారిక పర్యటన సందర్భంగా తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కి స్వాగతం పలికి పుష్పగుచ్చం దుశ్యాలవతో సత్కరించిన పి సి రాయులు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా పూజారి ప్రేమ్‌కుమార్



రేణిగుంట, డిసెంబర్30 ప్రభాతవార్త: రేణిగుంట మండలం బిజెపి అధ్యక్షుడిగా పూజారి ప్రేమ్ కుమార్‌రెడ్డిని బిజెపి మండల పార్టీ శ్రేణులు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన బిజెపి రేణిగుంట మండల సర్వసభ్యలో ప్రేమ్ కుమార్ ను పార్టీ మండల నేతలు కార్యకర్తలు బూత్ కమిటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ ఆయన పేరును ప్రతిపాదించగా శ్యాంచంద్ గీహ్లోట్, లక్ష్యం గారి రమణారెడ్డి బలపరిచారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాళహస్తి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి, రేణిగుంట మండల బిజెపి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కోలా ఆనంద్ కుమార్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి,కండ్రిగ యతీంద్రరెడ్డి, జాన్ మధుకర్, భీమవరం నరేష్, మేకల గురవయ్య, చింతం రాజా రాయల్, ఐనూరు భాస్కర్, కండ్రిగ మునస్వామిరెడ్డి, చింతకాయల లోకేష్‌రెడ్డి, పురుషోత్తం, కిరణ్, నాగరాజు, అజిత్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ఏకాంబరం, జనం కోసం వేణు, ఆర్. మునివేలు, కార్తీక్ రెడ్డి, ఎం. మణి, కొండ కిషోర్, నిఖిల్, లోకేష్, వినయ్, ప్రవీణ్, గోపి, రాఘవ, జగదీష్, కిషోర్, నాని, వినీత్, సురేష్, కృష్ణాపురం మునీంద్రా, మునేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## షాపు యజమానులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కేవీబీ పురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: దొంగతనాలు సైబర్ నేరాలు ఆకతాయిల ఆగడాలు అవాంఛనీయ సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు నారాయణవనం రూరల్ సీఐ రవీంద్రబాబు ఆదేశాల మేరకు కేవీబీ పురం ఎస్ఐ ఓబయ్య నేతృత్వంలో కేవీబీ పురం పోలీసులు మండల కేంద్రంలోని వివిధ రకాలైన షాపుల వద్దకు వెళ్లి విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు కేవీబీపురం ఎస్ఐ ఓబయ్య నేతృత్వంలో పోలీసులు షాపు యజమానులకు ఇంటి యజమానులకు అవగాహన కల్పించిన నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

## బి కేర్ ఫుల్...డీఎస్పీ శ్రీనివాసరావు.

రేణిగుంట, డిసెంబర్30 ప్రభాతవార్త: ఆంగ్ల నూతన సంవత్సర ప్రారంభ, ప్రస్తుత సంవత్సర వీడ్కోలు వేడుకల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం డిఎస్పి శ్రీనివాసరావు ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సర ప్రారంభ, ప్రస్తుత సంవత్సరం వీడ్కోలు వేడుకలను సంతోషంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా జరుపుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. అర్ధరాత్రి పెద్ద పెద్ద శబ్దాలతో బాణసంచా కాలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రోడ్ల కూడళ్ళ వద్ద, నడిరోడ్డుపై కేకులు కట్ చేయకూడదు అన్నారు.అల్లరిమూకల ఆగడాలను కట్టడి చేయడానికి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ శరత్ చంద్ర, రూరల్ సీఐ మురళీకృష్ణ, ఏర్పేడు సీఐ జయచంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజుల మండలం ఎస్సై సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బందితో గస్తీ ముమ్మరం చేస్తామని తెలిపారు. మఫ్టీలో పోలీసులు అన్ని ప్రాంతాల్లో ఉండి ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తారన్నారు.

## కేంద్రమంత్రికి ఘన స్వాగతం..



రేణిగుంట, డిసెంబర్30ప్రభాతవార్త : కేంద్ర వ్యవసాయ, సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. తిరుమల తిరుపతి పర్యటన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు రాష్ట్ర వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ ఫైనాన్స్ డైరెక్టర్ తేజోవతి, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పలువురు బిజెపి నేతలు పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

## శ్రీకాళహస్తి ఆర్డీవోని కలసిన టీడీపీ నేతలు



కేవీబీ పురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని తిమ్మ సముద్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అవకతవకలను సరి చేయాలని హక్కు దారులకు న్యాయం చేయాలని మండలంలోని తిమ్మ సముద్రం తెలుగుదేశం పార్టీ నేతలు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలసి విన్నవించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిమ్మ సముద్రం సర్పంచ్ ఎర్రం దొరబాబునాయుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆర్డీవోని కలసి విన్నవించారు. ఆర్డీవోని కలసిన వారిలో ఆయకట్టు ప్రెసిడెంట్ శివయ్య నాయుడు, వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి, డైరెక్టర్లు వీరారెడ్డి, బొర్రా శేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డిలు ఉన్నారు.

## బాలికల వసతిగృహంలో దుప్పట్ల పంపిణీ



తొట్టంబేడు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహంలో శ్రీకాళహస్తి ఓం సత్యసాయి అన్న ప్రసాద మరియు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లును పంపిణీచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోవనూరు ఎస్‌బిఐ మేనేజర్ రమేష్‌బాబు, ఆడిటర్ మల్లిఖార్జున్, వార్డెన్ హేమలత, ఆనందరావు, సభ్యులు లలితమ్మ, పాండురంగయ్యచెట్టి, దామోదర్‌నాయుడు, మిద్దెలరామయ్య మునికృష్ణయ్య సునీల్ కుమార్, మధులు పాల్గొన్నారు. మొత్తం 105మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీచేశారు.

## ఆత్మగౌరవం కోసం టిడిపిలో ప్రతి ఒక్కరు చేరండి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: స్వతంత్ర ఎంతో మంది స్ఫూర్తి ప్రధాతలను అందించిన తెలుగు నేలను కాపాడుకోవడానికి తెలుగువారి ఆత్మగౌరం కోసం ప్రతి ఒక్కరు తెలుగుదేశంపార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలని 13వ యూనిట్ ఇన్‌ఛార్జి రాష్ట్ర పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి) అన్నారు. ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల అహకారంతో పెట్రేగిపోయిన నాటి కాంగ్రెస్ పార్టీకి ఎదురొడ్డి పోరాడి లక్షలాది బడుగు, బలహీన వర్గాల కుటుంబాలను గౌరవానికి బాధ్యతకు గుర్తుగా భావించడం జరుగుతోందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వన్నెకులక్షత్రియ డైరెక్టర్ మిన్నల్‌రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్‌రావు పార్టీ 22వ అధ్యక్షుడు పూలశేఖర్, బిసి విభాగం నాయకులు శివకుమార్, లోకేష్, రమేష్, శేషయ్య, భవాని, రేఖ, శంకరమ్మ, మీనాక్షి, గంగమ్మ, చంద్రకళ, నంద, మణెయ్య, రమణ, గోపాల్, పెంచలమ్మ, మునికృష్ణయ్య బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో వివాదాలు వద్దు:డిఎస్‌పి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: నూతన సంవత్సర వేడుకలు ఆమోదయోగ్యంగా ఆహ్లాదకరంగా ఆరోగ్యరంగా హానిరహి తంగా జరుపుకోవాలని డిఎస్‌పి నరసింహామూర్తి పిలుపునిచ్చారు. సోమవారం అర్బన్ స్టేషన్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రజలకు తిరుపతి జిల్లా ఎస్‌పి. ఎల్ సుబ్బారాయుడు తరపున 2025వ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 31వ తేదీ రాత్రి ప్రజలు ముఖ్యంగా యువత నిర్వహించుకునే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు తప్పనిసరిగా ఏర్పాటు చేశామన్నారు. మద్యం దుకాణదారులు వారికి కేటాయించిన నిర్ణీత సమయంలో మద్యం విక్రం చేయాలని సమయం దాటిన తర్వాత మద్యం సరఫరా చేసే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. టుటౌన్ సిఐ వెంకటేశులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంకాళమ్మ ఆలయం వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: పివి రోడ్డు నందు వెలసి ఉన్న అంకాళమ్మ దేవస్థానంలో గత మూడు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా మరాఠీ పాలెం వాస్తవ్యులు అయిన యశ్వంత్‌రావు, బాలాజీ రావు, జయగణేష్, రాజశేఖర్‌రావుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల సహాయ సహకారాలు అందించిన డాక్టర్ కృపానిధి, లోకేష్ యాదవ్, శివకుమార్‌రెడ్డి, క్రాంతికుమార్, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, బాబు, సత్యనారాయణరావు, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, అనూష, షర్మిళ, కల్పన, జ్ఞానప్రసన్న, కృష్ణప్రియ, శ్రీరాం, అరుణ్, భారత్, సాయిప్రదీప్, అవినాష్‌రెడ్డి, బాలాజీ, ఓంకార్, నాగేంద్ర, వరప్రసాద్, లీలామోన్, దిలీప్ మయూర్ ప్రసన్న, రాజేశ్వరరావు, దినకర్‌రెడ్డి, కార్తీకేయన్, చేతలిశర్మ, జయంత్‌సింగ్, ఆనందనారాయణ్, దీపాన్షయాదవ్, హరిహర కుమార్, శివప్రసాద్, వినోద్‌కుమార్,సతీష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## మహిళా సంఘాలతో సుధారెడ్డి మమేకం



రామచంద్రాపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: మండలంలోని మహిళా సంఘాల సభ్యులతో ఎంఎల్ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి మమేకమై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సోమవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్న ఆమెకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళాల సంఘాలకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు స్కీముల ద్వారా మహిళా సంఘాలకు సబ్సిడీపై వాహనాలు అందిస్తుందన్నారు. అధికారులు చట్టాలను గౌరవించి, చట్టం ప్రకారం ముందుకు వెళ్ళాలని మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి, తహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఓ ఇందిర, ఎపిఎం గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,**GONUGUNTLA GIRIDHAR NAIDU** (old Name), R/at 18-1-46/J1, Prasanthi Nagar, Tirupati Dist.A.P. I have changed my name as (New Name) **GONUGUNTLA GIRIDHARA NAIDU** S/o Gonuguntla Govinda Naidu.

# ఉపాధి పనులు చేపట్టా :ఎంపీపీ




బాలాయపల్లి, డిసెంబర్ 30 ప్రభాత వార్త : రైతులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పథకం పనులను చేపట్టాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి తెలిపారు. స్త్రీ శక్తి కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్యసమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. పలు శాఖల అధికారులతో శాఖలవారిగా జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను సత్వర పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం అడవుల్లో చెరువుల్లో రైతులకు నిరుపయోగంగా ఉండే పనులు చేపడుతు న్నారని అన్నారు. పంట కాలువలు పూడిక తీత పనులు వంటివి చేయాలని ఎంపీపీ సూచించారు. జయంపులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు భవనం అసంపూర్తిగా ఉందని పూర్తి చేయాలని ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లును ఎంపీపీ ఆదేశించారు. తల్లిదండ్రులు నాయకులు కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ కీళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రజా ప్రతినిధులు పరిశీలించాలని సూచించారు. వెంగమాంబ పురం సర్పంచి బి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పంట కాలవల పనులు ఉపాధి హామీ పనులలో చేపట్టాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారిని శిరీష మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా తెప్పించి ఇస్తున్నామని తెలిపారు. పంటల నమోదు, బీమా చేపడుతు న్నామని అన్నారు. ఇంకా ఎవరైనా రైతులు బీమా చేసుకోవచ్చునన్నారు. నిడిగల్లు జయంపు మార్గమధ్యంలో తారు రోడ్డు అధ్వానంగా ఉందని పూర్తిచేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఎంపీపీ కోరారు. బాలయపల్లి ఎస్టీ కాలనీ, అక్కసముద్రం గ్రామాలలో నీటి సమస్య ఉందని చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు బంగారు పేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకున్నం దుకు రూ.2,75,000 నుంచి 10 లక్షల రూపాయలు వరకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. 20 కోట్లు వరకు ఎస్.హెచ్.జి రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కువగా పొదుపు లక్ష్మి సభ్యులు రుణాలు తీసుకొన్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ ప్రధానమంత్రి జన్ ధన్ కింద అకౌంట్లో ఓపెన్ చేసుకోవాలని కోరారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి కొద్దిసేపు మౌనం పాటించారు.. దేశం ఆర్థిక దిగ్గజాన్ని కోల్పోయిందని ఎంపిపి అన్నారు. పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, వైస్ ఎంపీపీ వాన పార్వతి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఆఫీస్ ఉద్దీన్,హౌసింగ్ ఏఈ జిబి వెంకటేశ్వర్లు, సర్పంచులు గాయత్రి, వెంకటసుబ్బయ్య, అంజలి, రామయ్య వెలుగు ఏపిఎం పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తులు పంపిణీ




కోట,డిసెంబర్ 30 ప్రభాతవార్త : కోటలోని మమాత్మాజ్యోతిరావు పూలే బాలురు గురుకుల పాఠశాలలో సోమవారం తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు,షెక్.జలీల్ అహ్మద్, కొత్తపాళెం జలసంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డి క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు.జోనల్ వైజ్ దొరవారిసత్రంలో జరిగి టోర్నమెంటుకు పాఠశాలలోని క్రీడా కారులకు జెర్సీలను అంద చేశారు.ఈజెర్సీల సూమారు రూ 15వేల ఖర్చుచేసి దాృత్వతం చాటకున్నారని ప్రిన్సిపల్ నారాయణ రావు చెప్పారు. వారికి ప్రన్సిపల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జలీల్ ఆహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ టోర్నమెంట్సలో ఉత్తమ క్రీడాకారులగా రాణించాలని, గురుకులం పేరు ప్రతిష్టలను జిల్లా స్దాయిలో నిలబెట్టాలని వారు ఆంకాక్షించారు.

## ఆర్టీసీ సమస్తను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త : వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపోలో బెంగళూరుకు నడిపే రెండు ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొత్త బస్సులనే గత ప్రభుత్వం డిపోలకు ఇవ్వలేదని తెలిపారు. ప్రయాణికులు బస్సుల కోసం తీవ్ర ఇబ్బంది పడే వారిని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు కొత్త బస్సులను ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా డిపోలకు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళిరెడ్డి, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రాధమ్మ, రామారావు సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా




వెంకటగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త : విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల పరిష్కారం కొరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల విద్యార్థిని విద్యార్థులంతా కళాశాల నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పిడిఎస్ఓ పట్టణ నాయకులు సిహెచ్ పవన్ మాట్లా డుతూ జూనియర్ డిగ్రీ కాలేజీలు 1968లో ప్రైవేటు మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పడినాయి. 1977లో కాలేజీ భవనాలు, మొత్తం స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు కలిపి కాంపోజిట్ కాలేజీగా ఉండేది. 2002లో జూనియర్ లో కాలేజీని విడగొట్టారు. 2007లో విశ్వదయ స్థలాలు వేలంపాటలు జరగగా ప్రైవేట్ వ్యక్తులు కొంత స్థలాన్ని కా పాడుకున్నారు. ఇదే సమయంలో డిగ్రీ కాలేజీని తిరుపతి రోడ్లోకి తరలించగా స్థలాలు, భవనాలు ఇక్కడే ఉండిపోయాయి. కనుక ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 10 వరకు తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మన పాలకులు విద్యారంగాన్ని క్రమంగా ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్తున్నారు. ఈ ఆందోళనకు స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎస్ ఝాన్సీ, ఏఐవైఎఫ్ నాయకులు సాయికుమార్ మద్దతు ప్రకటించారు. పిడిఎస్ఓ నాయకులు హరి ప్రసాద్, లీలా మోహన్, తిరుమలేష్ నాయకత్వం వహించారు.

## క్యాన్సర్ భాదితురాలికి ట్రస్ట్చే ఆర్థిక సాయం



చిల్లకూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం కోట క్రాస్ రోడ్ ప్రాంతంలోని నక్కల వారి కండ్రిగ గిరిజన కాలనీలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అన్నం లక్ష్మమ్మ అనే మహిళకు సోమవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో వైద్యం ఖర్చుల నిమిత్తం 15వేల రూపాయలను ట్రస్ట్ ప్రతినిధులు బాబు, భాస్కర్ల ద్వారా బాధిత మహిళకు అందజేశారు.

## కట్టా సుధాకర్రెడ్డి దంపతుల దాతృత్వం

**- రూపుదిద్దుకున్న బస్సుషెల్టర్**



నాయుడుపేట/చిట్టమూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త :నాయుడుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద కెఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత కట్టా సుధాకర్రెడ్డి, నాయుడుపేట జడ్పిటిసి కట్టా జ్యోతిరెడ్డి దంపతుల సౌజన్యంతో నూతన బస్సుషెల్టర్ రూపుదిద్దుకుంది. కట్టా సుధాకర్రెడ్డి తనతండ్రి కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థంగా నాయుడుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద సుమారు రూ.10లక్షల తన సొంత నిధులతో ప్రయాణికుల వసతి సము దాయం (బస్సుషెల్టర్) నాయుడుపేట రోటరీక్లబ్ సహకారంతో నిర్మించారు. కాగా, జనవరి 4వ తేదీన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బస్సు షెల్టర్ను ప్రారంభించనున్నారు. సోమవారం కెఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత కట్టా సుధాకర్రెడ్డి పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ నాయుడు పేట నుంచి మేనకూరు మీదుగా వెంకటగిరికి వెళ్లే ప్రయాణికులు గతంలో ఎండ వానలకు ఇబ్బంది పడేవారని అన్నారు. తన తండ్రి కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థంగా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



కోట, డిసెంబర్ 30 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని వావిళ్లదొరువు, యమదిన్నెపాలెం గ్రామాల్లో సోమవారం గిరిజన కాలనీల్లో కోట మండల షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య ఆధ్వర్యంలో దాతలు చంద్రాచార్యులు, ప్రవీణ్కుమార్ చేతులు మీదుగా వంద వంద గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ గూడూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వాటంబేటి చెంగల్రావు మాట్లాడుతూ గిరిజన కుటుం బాలకు ఇంత గొప్ప సహాయం చేసిన అక్షయ సేవాసమితివారికి, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్షయసేవాసమితి వారు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మస్తానయ్య, వెంకయ్య, అల్లం రమణయ్య, సుబ్బయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి నదిలో పడి పశువుల కాపరి మృతి



కోట, డిసెంబర్ 30 ప్రభాతవార్త : కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పశువుల కాపరి యల్లసిరి నాగూరయ్య (45) స్వర్ణముఖి నదిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఆదివారం పశువులను నదిలోకి తీసుకెళ్లాడు.అనంతరం నాగూరయ్య అదృశ్యమయ్యాడు. అగ్నిమాపక సిబ్బందికి ఆదివారం సాయంత్రం సమాచారం అందించగా, వారు నది మొత్తం గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం గూడలి గ్రామ వంతెన వద్ద మృతదేహాన్ని అగ్నిమాపకశాఖ సిబ్బంది గుర్తించారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ కె.జయజయరావు, ఎస్ఐ పవన్కుమార్లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది శ్రీహరి, నాగరాజు, శ్రీనివాసులు, దేశయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిబంధనలు పాటించండి : ఎస్ఐ

తడ, డిసెంబర్ 30 ప్రభాతవార్త : జనవరి 1 సందర్భంగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తడ ఎస్ఐ కొండప్పనాయుడు పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా 31న అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసు పికెటింగ్, గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు జరుపుకోవడం, డిజెలు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించడం, బాణాసంచా సామగ్రిని కాల్చడం, మద్యం దుకాణాలు తెరవడం నిషేధమని ఆయన చెప్పారు.

## హెల్మెంట్ ధరించాలి : డిఎస్పి



నాయుడుపేట డిసంబరు 30 ప్రభాతవార్త : ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించి వాహనాన్ని డ్రైవిగ్ చేయా లని నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు తెలియజేశారు. నాయుడుపేట పట్టణం లోని అమరావతి సర్కిల్ వద్ద సోమవారం హెల్మెంట్ ధరించి ప్రాణాలు కాపాడుకొవడంపై పోలీ సులకు ఆయన అవగాహన కలి ్పంచారు. డిఎస్పి చెంచుబాబు మాట్లడుతూ ద్విచక్ర వాహన దారులు ప్రతిఒక్కరు తప్పినిసరిగా హెల్మెంట్ ధరించి వాహనాన్ని డ్రైవింగ్ చేయడం ద్వార ప్రాణాలు కాపాడు కోవచ్చునన్నారు. ఆయన చేతుల మీదుగా పోలీసులకు హెల్మెంట్ అందజేశారు.అనంతరం పోలీసులు అందరు కలిసి హెల్మెంట్ ధరించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ బజారు వీదుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయుడుపేట సిఐలు బాబి, సంఘమేశ్వరావు,ఎస్సైలు ఆదిలక్ష్మి, స్వప్న, అజయ్కుమార్, నాగరాజు, పోలీసులు తదితరులు ఉన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు :డిఎస్పి

నాయుడుపేట డిసంబరు 30 ప్రభాతవార్త; నాయుడుపేట పట్టణంలో డిసంబరు 31వతేది రా త్రి ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు తెలిపారు.ఈసందర్భంగా డిఎస్పి చెంచుబాబు మాట్లడుతూ కొత్తసంవత్సరం సందర్భంగా ఎవ్వరు నిబంధనలు అతిక్రమించరాదన్నారు.అందరు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచించారు.ఆయన వెంట నాయుడుపేట సిఐ బాబి,పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్పిబియస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్రెడ్డి మాతృమూర్తి బృందమ్మ ఆకస్మికంగా తనికీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపట్ల ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. కాగా మరుగుదొడ్ల నిర్వహణ బాగానే ఉంది కానీ అక్కడ కొళాయిలు విరిగిపోయి నీరు వృధాగా పోతున్నందువల్ల కొత్త కొళాయిలను ఏర్పాటు చేయాలని సూచించారు.

# గూడూరు డివిజన్

## ఎస్సీ కాలనీ శ్మశనానికి దారి సౌకర్యం కల్పించండి



సత్యవేడు, డిసెంబరు 30 ప్రభాతవార్త: సత్యవేడు మండలం జడేరి ఎస్సీ కాలనీ శ్మశనానికి దారి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు పలువురు రెవెన్యూ అధికారు లకు విన్నవించారు. సోమవారం మండల పరిధిలోని కన్నవరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో గ్రామ సర్పంచ్లు బుజ్జమ్మ బాబు, జయంతి అధ్యక్షతన తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరమశివం తదితరులు హాజర య్యారు. ఎస్సీ కాలనీ శ్మశనానికి దారి సౌకర్యం లేకుండాపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు సర్పంచ్ బుజ్జమ్మ బాబు ఆధ్వర్యంలో కాలనీ వాసులు తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతి సమర్పించారు. ప్రస్తుతం మృత దేహాలను తీసుకెళ్లాలని నానా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే తమ స్వాధీనంలో సర్వే నెం.242/10లో 42 సెంట్లు రికార్డులో అనాధీనంగా చూపిన భూమిని మార్చాలని కన్నవరం బాధితురాలు బొజ్జల లలితమ్మ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఆర్ఐ సురేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వో శేఖర్, సచివాలయ వీఆర్వో నాగార్జున, కలైవర్ణ, సర్వేయర్ రజని, షణ్ముగం, డేటా ఎంట్రీ ఆపరేటర్ చంద్ర, స్థానిక టీడీపీ నాయకులు ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో పూజలు



శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి, తొండమాన్పురం ఆలయాల్లో శాంతి ప్రియదర్శిని రెడ్డి పూజలు జరిపించు కున్నారు. ఆమెకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి ఆమె రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లను ఎఇఓ విద్యాసాగర్రెడ్డి, పిఆర్ఓ రవి,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం పర్యవేక్షించారు.కాగా శ్రీకాళహస్తి మండలం తొండమాన్పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఇన్స్పెక్టర్ రవి దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల ప్రసాదాలు, అందించి ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్రావు జాదవ్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. స్వాగతం పలికిన వారిలో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్కుమార్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు ఎం.సుబ్రమణ్యం రెడ్డి, కండ్రిగ ఉమ,జివి అమర్నాథ్,గంగల పూడి హరి,డిల్లికుమార్,లు ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద వేదపండితులు మారుతీ శర్మ, అవినాష్శర్మ, వేదమంత్రాలతో స్వాగతం పలకగా ఏర్పాట్లను ఎఇఓ లోకేష్రెడ్డి, విద్యాసాగర్రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుబ్రమణ్యం, హరియాదవ్లు పర్యవేక్షించారు. మృత్యుంజయ ఆలయంవద్ద మంత్రికి ఇఒ టి.బాపిరెడ్డి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను,తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఆలపాకంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ

విజయపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: మండలంలోని ఆలపాకంలో ఇటీవల నిర్వహించిన రీ సర్వేపై రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వేలో ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్రాజు, టీడీపీ నాయకులు రవిచంద్రారెడ్డి, శివలింగం, గుణశేఖర్రెడ్డి, బెంజిమన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిమల్లం హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో భక్తులు రెండునెలల పాటు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. గతంలో వేలలో వస్తున్న హుండీ ఆదాయం లక్షల్లోకి పెరిగిందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరిబాబు తెలిపారు. సోమవారం హుండీల్లో సమర్పించిన కానుకలను చైర్మెన్, ఇఒ రామచంద్రారెడ్డిల సమక్షంలో లెక్కించారు.రెండు నెలల ఆదాయాలు రూ.4.65లక్షలు వచ్చినట్లు వివరించారు. ఆలయానికి రోజు రరోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుంది.రాకపోకలకు సంబంధించి రవాణా మార్గాలను అభివృద్ది చేస్తున్నామని చైర్మెన్ వివరించారు.

## విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

తిరుపతి క్రీడ, డిసెంబర్ 30 ప్రభాతవార్త: యు.జి.సి ఆదేశానుసారం ఫిట్ ఇండియా వీక్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా వేదవిశ్వవిద్యాలయంలో డిసెంబర్ 22 నుండి 30 డిసెంబర్ వరకు వారం రోజులపాటు విద్యార్థులకు క్రీడలు జరిగిన కార్యక్రమంలో భాగంగా యోగా, కబడ్డీ,వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ తో పాటు ఇండోర్ క్రీడలు కూడా నిర్వహించారు. ఆ క్రీడలలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు విద్యార్థులకు ఈనాడు విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణీ సదాశివమూర్తి చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగినది. ఈ కార్యక్రమంలో సంచాలకులు డా. భారత శేఖరాచార్యులు, డా.పి నీలకంఠం, డా. ఎస్.ఎస్ మూర్తి ,మోహిత్ చంద్ర పరాగి పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



తిరుచానూరు, డిసెంబరు30, ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి దర్శించుకున్నారు.కేంద్ర వ్యవశాయ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుటుంబ సమేతంగా సోమవారం అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ దేవరా జులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.ముందుగా ద్వజ స్థంభాన్ని నమస్కరించి అమ్మవారి ప్రత్యేక దర్శనంలో పాల్గొన్నారు. అనంతరం ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేసారు.అంతక ముందుగా తితిదే బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి కేంద్ర మంత్రిని ఘనంగా స్వాగతించి ఆయనతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఏవిఐ బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరాదికి కాణిపాకం సన్నద్ధం



కాణిపాకం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ ఆదేశాలతో ప్రత్యేక అలంకరణ, ఏర్పాట్లు లేకుండానే కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నూతన సంవత్సరాదికి సన్నద్దమైంది. ప్రతి ఏటా నూతన సంవత్సరాదికి విఘ్ననాయకుడైన గణనాధుని దర్శనార్థం వేలాది మంది భక్తులు తరలిరావడం ఆనవాయితీ. సంవత్సరాది రోజున విఘ్ననాదుని దర్శించుకుంటే అంతా శుభాలే కలుగుతాయని భక్తుల విశ్వాసం. దీనితో జిల్లా నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలనుండి కూడా భక్తులు స్వామి దర్శనార్థం పెద్దఎత్తున తరలి వసు ్తంటారు. ఇందుకోసం కాణిపాకం ఆలయం సంవత్సరాదికి సన్నద్ధమైంది. అయితే భారతీయ సంప్రదాయాలను వదిలి ప్రాశ్యాత్య సంప్రదాయాలకు పట్టం కడుతూ జనవరి 1న పండుగలు చేసుకోవడం భారతీయ వైదిక విధానం కాదని, కావున భక్తులు సమర్పించే కానుకలను అలంకరణలకు ఆర్భాటాలకు ఖర్చు చేసి ఆలయాల వద్ద పండుగ వాతావరణం సృష్టించడం సరికాదని, కేవలం భక్తులకు సాధారణ ఏర్పాట్లు మాత్రమే చేయాలన్న కమీషనర్ ఆదేశాలతో 2017 నుండి ఆలయంలో సంవత్సరాదికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం లేదు.ఈమేరకు ఈఏడాది కూడా సుమారు 60 నుండి 70 వేల మంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశాలున్నట్లు అంచనాలతో ఆలయ అధికారులు కేవలం సాధారణ ఏర్పాట్లు మాత్రమే చేపట్టారు. అదేవిధంగా ఆలయం వద్ద భక్తుల రద్దీదృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నూతన సంవత్సరాది సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థాన ంలో చేపట్టిన ఏర్పాట్లును ఆలయ ఈఓ పెంచల కిషోర్ సోమవారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనుంజయ, స్థానిక ఎస్సై ధరణీధర, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ హుండీ ఆదాయం రూ.16.99లక్షలు

తిరుపతి(రవాణ),డిసెంబర్ 30ప్రభాతవార్త: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈఓ జయకుమార్, ఇన్స్పెక్టర్లుగా వి.మునికృష్ణమూర్తి,గాలిగోపురం మఠం ఫిట్పర్సన్,సేవకులుపాల్గొని లెక్కించారు. అమ్మవారి ఆదాయం 64రోజులకుగాను 16,99,916రూపాయలు లభించింది. లెక్కింపును ఈస్టు పోలీసులు, సప్తగిరిగ్రామీణ బ్యాంకు సిబ్బంది పర్యవేక్షించారు.

## తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిలో వందపడకలు పెంచండి -ఎంపి

తిరుపతి(రవాణ),డిసెంబర్ 30ప్రభాతవార్త: తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని, కార్మికులకు అవసరమైన వైద్యసదుపాయాలు, వైద్యపరికరాలు అందుబాటులో ఉంచాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ ప్రాంతంలోని కార్మికులకు, సాధారణ ప్రజానీకానికి అవసరమై ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో ఇఎస్ఐ మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. డిల్లీలో ఇఎస్ఐ డైరెక్టర్ జనరల్ అశోక్కుమార్సింగ్ను కలిసి ఈ వినతి చేశారు.

## శెట్టిపల్లె భూ బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం

**- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి**



తిరుపతి రూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లె భూ బాధితుల సమస్యల పరిష్కార దిశలో చర్యలు చేపట్టామని, వచ్చే జనవరి నెల నాటికి నాలుగు, సంక్రాంతి నాటికి రెండు లే అవుట్ల ప్రొసీడింగ్స్ ప్రతులను లబ్దిదారులకు అందిస్తామని, అలాగే కూటమి ప్రభుత్వం కూడా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం ఉదయం తిరుపతి నియోజకవర్గం శెట్టిపల్లి గ్రామం నందు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు నందు తిరుపతి ఎమ్మెల్యే మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నారపు రెడ్డి మౌర్య తహశీల్దార్ భాగ్యలక్ష్మి తదితర సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టిపల్లె సాధన సమితి వారు పలువురు ప్రజలు సంఘాల నాయకులు శెట్టిపల్లె భూ సమస్యలపై పలు అంశాలు వారిద్దరి దృష్టికి తీసుకుని వచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6వ తేది నుంచి వచ్చే నెల జనవరి 8వ తేది వరకు 33 రోజులు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, 1.5 సెంట్లకు తక్కువ కాకుండా ఇంటి స్థలాన్ని ఇవ్వడం జరుగుతోందన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు శెట్టిపల్లెకి నాలుగైదు పర్యాయాలు రావడం జరిగిందని, శెట్టిపల్లె భూ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే సీఎం, సీఎం సెక్రటరీ ప్రద్యుమ్న దృష్టికి, అలాగే సంబంధిత ఉన్నత అధికారులు, రాజకీయ ప్రముఖుల దగ్గరికి కూడా తీసుకెళ్ళి పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి చిత్తశుద్ధితో అధికారులకు సూచనలు ఇస్తూ శెట్టిపల్లె భూ సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చొరవ చూపుతున్న కలెక్టర్ను ఎమ్మెల్యే ప్రశంసించారు. డెప్యూటీ తహశీల్దార్ అశోక్రెడ్డి, ఆర్ఐ రామచంద్రారెడ్డి, తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నత్రజని వాడకం పట్ల అప్రమత్తత అవసరం



శ్రీకాళహస్తి రూరల్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రబీ సీజన్లో సుమారు 32వేల హెక్టార్లలో సేద్యం సాగుతుందని రైతులు ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సోమవారం వ్యవసాయశాఖా ధికారులు సూచించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమేష్రెడ్డి వారి సిబ్బందితో కలసి శ్రీకాళహస్తి మండలం తొండమాన్పురం గ్రామ పరిసరాల్లో పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా సలహాలు ఇచ్చారు.రైతులకు పంట పొలాలకు సంబందించి పలు సూచనలు చేసారు. అధికంగా వరి పండిస్తున్నారని పంట పొలాల్లో పరిశీలించారు. తెగుళ్ళ గురించి ఆందోళన తొందరపాటు వద్దన్నారు. యూరియా ఎక్కువ వాడటం వల్ల మరో ప్రమాదం ఎక్కువ తెగుళ్ళు ఆశిస్తాయని తెలిపారు.

## హోటళ్ళలో కల్తీ ఆహారం:పట్టించుకోని ఫుడ్ ఇన్స్పెక్టర్



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి ప్రతినిత్యం వేలాది మంది యాత్రికులతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి వేలాది మంది వివిధ పనుల మీద వస్తుంటారు అయితే ఇక్కడి హోటళ్ళలో కల్తీ ఆహారంతో తిప్పలు పడుతున్నారు.అలాగే పాఠశాలల సమీపంలో కూడా కల్తీ అల్పాహారాలతో విద్యార్థులకు అస్వ స్థతకు గురౌతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. అయితే గతంలోమున్సిపల్ స్థాయిలో ఫుడ్ఇన్స్పెక్టర్లు పరిశీలించి చర్యలు తీసుకునే వారు. అయితే ప్రస్తుతం మున్సిపల్ సిబ్బందికి ఆ అధికారం తప్పించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ తిరుపతికే పరిమితమౌతున్నారు. శ్రీకాళహస్తి పట్టణం నిండా హోటళ్ళు, పరిసరాల్లో డాబాలు వెలసి నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి ఆహారం అందిస్తున్నారనే పరిశీలన లేకపోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఆర్టిసి బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్లో బిరియాని తిన్న ఓ వ్యక్తి వాంతులు చేసుకొని అస్వస్థతకు గురౌతున్నారు.

## రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన కేంద్రమంత్రి




రేణిగుంట డిసెంబర్ 30ప్రభాతవార్త : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని కేంద్ర వ్యవసాయ రైతుసంక్షేమ గ్రామీణఅభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారంసందర్శించారు. ముందుగా ఆయన కృషి విజ్ఞాన కేంద్రంలోని ఆచార్య ఎన్.జి.రంగా విగ్రహానికి పూలమాలలు వేసి పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుచేసిన వ్యవసాయ ప్రదర్శనలను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి రైతులతో ముఖాముఖి చర్చించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రదర్శన కేంద్రాల నిమిత్తం ఇన్పుట్స్ వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. చివరగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కోసం ప్రచురించిన పలు పుస్తకాలను మంత్రి విడుదల చేశారు. రాస్ సంస్థ రైతులకు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా, రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తహెడ్ డాక్టర్ శ్రీనివాసులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్ జి టి 4. రాస్ ప్రచురణలను విడుదల చేస్తున్న కేంద్రమంత్రి.